
# "నాన్నా... వచ్చావా?



పద్మాలతీ గంగాధర్

"రండి, రండి ...అంతా రండి... డ్రాయింగు రూములో కూర్చుందాం

మీ అందరికీ యివ్వాళొక విషయం చెప్పదల్చుకున్నాను. ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను....నా మనస్సులోని భావాలు మీకు ఎప్పుడు చెప్పాలో...ఎలా చెప్పాలో....అనే ఆలోచనలతో యింత కాలం సతమతమవుతూ గడిపాను.... ఇవ్వాళ....అందరూ ఉండగా... ఏమైనా సరే చెప్పాలనే నిర్ణయానికొచ్చాను.

నన్ను సంపూర్తిగా అర్థం చేసుకోమనే నా కోరిక... మధ్యలో ఎవ్వరూ నన్ను ఆపవద్దు .. మీకు వినటం ఎంత కష్టమో....చెప్పటం నాకు అంతకన్నా కష్టం. కాని తప్పదు....ఈ అవకాశం మళ్ళీ రాదు.

... చెదలపట్టినట్లాంటి గుప్పెడు మనస్సు ...ఎక్కడ మొదలుపెట్టాలో తెలియటంలేదు.

నా గతం, మీకు అంతా బాగా తెలియదు. ఒకనాడు....నేను భోజనం చేస్తున్నా....నాకు ఎదురుగా మా అమ్మ కూర్చొన్నది. నేను తలెత్తి చూసాను. ఆమె కంటనీళ్ళు పెడుతూ ఆదోలా కూర్చుని ఉన్నది. "ఎందుకమ్మా ..ఏంజరిగింది?" అంటూ అడిగాను.

"ఫలానావాళ్లు... కవుళ్ల చేసుకుంటూ....బ్రతికేవాళ్ళ అబ్బాయికి మనం పిల్లను ఎలాయిస్తాం? అన్నారట" అని వెక్కి వెక్కి ఏడుస్తూ, చెప్పలేక చెప్పింది.

"వాళ్ళ తప్పేముందదీనిలో?....నిజం చెప్పారు....నిజాన్ని గ్రహించి....మనను వాళ్లు అలా అన్నందుకు....వాళ్ళకు మనం ఎంతో రుణపడిఉన్నాం"

"ఏమిటిరా నీవనేది?"

"ఆర్థికంగా మనకూ వాళ్ళకూ, నక్కకూ నాగలోకానికి ఉన్నంత తేడాఉంది. ఆ అమ్మాయి పెరిగిన పరిస్థితులువేరు.... మన పరిస్థితివేరు... ఒకరి ఆశలూ, ఆలోచనలూ, ఆశయాలూ, వాళ్లు వాళ్లు పెరిగిన వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి... అలాంటప్పుడు....ఇద్దరకూ పొసగటం అనేది చాలాకష్టం.... వాళ్లు నిజం చెప్పినందుకు నీకు కష్టంగా ఉండి ఉండాలి. అందుకనే నిజం చేదులాంటిదన్నారు....చాలావిషయాలు నీకు అర్థంగావమ్మా .... నాకుమటుక్కు చాలా సంతోషంగా ఉంది...."

"ప్రతీదానికీ ఉపన్యాసం ఇస్తావురా"

"నిజమేచెప్పాను....వచ్చేనెలలో నేను అమెరికా వెళుతున్నానమ్మా"

"అమెరికా!....అదిఎక్కడ?"

"అదొక దేశం........కొన్ని వేలమైళ్లు దూరంలో ఉంది. ఉద్యోగం చేస్తూ చదువుకోటానికి వెళుతున్నా...."

ఇది నేను మరువలేని సంఘటనల్లో ఒకటి. గాయంమానినటు బైటకు కన్పించవచ్చు. మచ్చకూడ కన్పించక పోవచ్చు....అలాంటి గాయాలెన్నో....

నేను అమెరికా వెళుతున్నానని తెల్సికొని మావూరు విస్తుపోయింది. నమ్మిన వాళ్ళకన్నా నమ్మనివాళ్ళు ఎన్నోరెట్లు ఎక్కువ. బారిష్టరు పార్వతీశంలా అమెరికా వెళ్ళాను. అయిదు సంవత్సరాలు


ఉన్నాను. ఆదేశం, నా జీవిత గమనాన్నే మార్చింది. నీరుపల్లమెరుగు అంటారు కానీ మానవజీవిత ప్రవాహాన్ని గురించి అలా ఎవ్వరూ ఏమీ చెప్పలేరనుకుంటాను. జీవించటం అంటే ఏమిటో అక్కడే నేర్చుకున్నాను. పారిస్, సోమర్‌సెట్ మాంకు ఎలాగో, అలాగే అమెరికా నాకు. అది నాజీవితంలో గోల్డెన్ పిరియడ్. మరుపురాని, మరువలేని ఆ జీవితాన్ని తల్చుకుంటూనే, జీవితాన్ని గడుపుతున్నాను.

అయిదు సంవత్సరాల తరువాత మనదేశం తిరిగి వచ్చాను.

మా ప్రక్క ఊరునుంచి, మీఅమ్మను యిస్తామని పెళ్ళిసంబంధానికి మాయింటికొచ్చారు. మొట్టమొదటి గన్నాన్యవాళ్ళు అంతరిక్షానికి వెళ్ళినప్పుడు అమెరికావాళ్ళు ఎలా 'షాక్' తిన్నారో అలా షాక్ తిన్నది మావూరు. ముష్టివాడికి మరొక ముష్టివాడంటే గిట్టదు. అటు చెప్పే మాటలు అటు చెప్పారు. ఇటు చెప్పేవి యిటూ చెప్పారు. "అంత ఉన్న కుటుంబంలో నుంచి వచ్చిన పిల్ల మీ యింట్లో ఉంటుందా?....మీకు చేసి పెడుతుందా? ....మిమ్మలను లెక్క చేస్తుందా?.... సరిగా కాపురం చేస్తుందని నమ్మకమేమిటి?...." అలా ఎన్నో మాఅమ్మకు నూరిపోసారు. ఏడ్చేవాళ్ళు ఏడుస్తూనే ఉంటారు. వాళ్ళ కోసమని ఏదీ ఆగదు. జరగవల్సింది జరిగి తీరుతుంది. నిజానికి మా అదృష్టం కొద్దీ మీ అమ్మ మా యింట్లో కాలు పెట్టింది. ప్రతిమనిషిలోనూ ఏవేవో లోట్లు ఉంటానే ఉంటాయి. లేకపోతే మనిషి మనిషే కాదేమో! మీ అమ్మ మనస్సు చల్లని వెన్నెల మీకు తెలియక పోవచ్చు.

కాని మీ అమ్మంటే నాకు మాత్రం కోపమే. ఒక కంప్లయింటు కూడాను. మీరు పుట్టిన తరువాత నన్ను పూర్తిగా మర్చిపోయింది. మీరే ఆమెకు సర్వం అయ్యారు. మీరు ఆమె వండిన కూర బాగుందంటేనే బాగున్నట్టు. అప్పుడే ఆమెకు ఎంతో తృప్తి. నేను మాటవరసకేదైనా అంటే" నాకేమిటీ....నా బిడ్డలున్నారు....పెళ్ళే నా ఆస్తిపాస్తులు...." అనేది. "సరే అలాగే అనుకుంటూండు.. ప్రతి తల్లీ అలాగే అనుకుంటూఉంటుంది. కోడళ్ళువచ్చే వరకూ....అప్పటి వరకూ నేనూ నీకు గుర్తుకు రానులే....ఒక నాటికి నీవే తెల్సుంటావ్....నీకు బిడ్డలు గాదు సర్వం. నేను" అని అంటూండేవాడిని. కాని ఈ విషయంలో కూడ నేనే ఓడిపోయాను. చూస్తూంటే, బిడ్డలకంటే, ఇంటికొచ్చిన ఇద్దరు కోడళ్ళూ, అల్లుడూ ఆమెకు చాలా దగ్గరయ్యారనిపిస్తూంది. మిమ్మలనూ, మనుమలనూ, మనుమరాళ్ళనూ చూసుకొని నన్ను పూర్తిగా మరచిపోయింది. నా ఉనికినే గమనించటం లేదు. ఇది అంతా నా అదృష్టం గాదూ!.... జీవితంలో, ఏ మనిషైనా ఇంతకన్నా ఏమికోరుకుంటాడుచెప్పండి.

అలసటనేది ఏమిటో తెలియకుండా దాదాపు నలభై సంవత్సరాలు సంపాదనా వ్యాపకంలో గడిపాను. నాకు తగిలిన ఎదురుదెబ్బలు మీకు తగలకూడదనీ, నాకు జరిగిన అన్యాయాలు మీకు జరగకూడదనీ, నాకు కల్గిన అవాంతరాలు మీకు కలుగ గూడదనీ,




నా చిన్ననాటి నుండీ తీరని కోరికలు, మీ ద్వారా తీర్చుకొంటూ, "యిది అంతా నాది....నా కష్టార్జితం....నాఒక్కడిదే'' అని గర్వపడతూ, మిమ్మలను చూచి మురిసిపోతూ, అలుపూ, సొలుపూ ఎరుగకుండా జీవితాన్ని గడిపాను.

అంత తృప్తిగా బ్రతుకుతున్న నాలో ఏదో తెలియని తీరని, అసంతృప్తి ఏర్పడింది .... ఆరని ఆరాటం .... ఏదో లోటనిపిస్తూంది, ఆవెలితి ఏమిటో విడమర్చి వివరంగా చెప్పలేకపోతోంది నా మూగ మనస్సు. ఎక్కడికక్కడకో వెళ్ళాలనీ, ఎన్నో సుందర ప్రదేశాలను స్వేఛ్ఛగా తిరుగుతూ చూచి ఆనందించాలనీ, ఎంతో చదవాలనీ, ఎన్నో నేర్చుకోవాలని, ఏదేదో రాయాలనీ నా మనస్సు ఆరాట పడుతోంది. చిన్నప్పుడు ఎవరి మీదన్నా కోపం వస్తే, వికృతంగా వాళ్ళ బొమ్మలు గీసేవాడిని. అన్యాయాలనూ, అవమానాలనూ చూచినప్పుడూ, విన్నప్పుడూ, ఏమీచేయలేక కసికొద్దీ కధనో, గేయాన్నో రాసి నా కోపాన్నీ, తపననూ చల్లార్చుకునేవాడిని. ఇన్నాళ్ళూ అజ్ఞాతంగా ఉన్న ఆనాటి తీరని కోరికలు, యిప్పుడు నాహృదయాన్ని పిండి వేస్తున్నాయి. మీపై కోపంతోనూ గాదు, ద్వేషంతోనూగాదు,.... స్వేఛ్ఛ కొరకు నా మిగిలిన జీవితం నన్ను ఆరాట పెడుతూంది. ఆ ఆరాటం రోజు రోజుకూ పెరుగుతూంది. రగిలి, రగిలి, ఆ అగ్ని గుండం బ్రద్దలవ్వక ముందే ..యీబంధనాలనుండి బైటపడి..మానసిక తృప్తికోసం అన్వేషణకు బైలుదేరటానికి నిశ్చయించుకున్నాను. నాయీకనీసపు కోరికనుకాదనకండీ....నా దారికి అడ్డు రాకండి.... 'మన మంచితనమే మనకు శ్రీరామరక్ష' అనినమ్మె దేవత....మీఅమ్మా మీరూ హాయిగా ఉండండి....గుడ్ బై.

○ ○ ○

దీపావళి పండుగ దినాలు కంపెనీ పనిమీద క్యాంపుకు వెళ్లాను, దీపావళికి రెండురోజులు ముందుగానే రావల్సినది.

రాలేక పోయాను. గాలివానలు.. టెలిఫోను లైనులు చెడిపోయినాయి. ఢిల్లీ నుంచి యింటికి కనెక్షను దొరకలేదు. ఎన్నో సార్లు ప్రయత్నించాను. ఫ్లయిట్ లు కేన్సిలు అయ్యాయి. ఎలాగైతేనేం. దీపావళి రోజున ఇంటికివచ్చాను. మా అమ్మాయీ, అల్లుడూ, పిల్లలతో వచ్చి ఉంటారు ఇల్లంతా సందడిగా, కళకళలాడుతూ ఉంటుంది అనుకొంటూ ఇంటికి వచ్చాను.

లోపల కాలుపెట్టానో లేదో "నాన్నా వచ్చావా?" అంటూనన్ను కావిలేసుకుని మా అమ్మాయి ఆవురుమున్నది. నా కేమీ అర్థం కాలేదు. అందరూ నా చుట్టూరా చేరారు. మా అమ్మాయి వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది. నేను చెప్పిన నాటికి రానందుకు వీళ్ళంతా భయపడి ఉంటారనీ, నాపై వాళ్ళకెంతో ప్రేమనే అనుకున్నాను. పట్టరాని సంతోషంతో మా అమ్మాయి తల నిమురుతూంటే, నా కళ్ళల్లో నీళ్ళు నిండాయి. మరో క్షణంలో మా ఆవిడ గుర్తు కొచ్చింది. అక్కడ లేదు. అంత హడావుడిగా ఉన్నా అక్కడకు రాలేదు భయపడ్డాను. "అమ్మేది? ఎక్కడుంది?...." అని ఆతురతగా అడిగాను. మా అమ్మాయి నన్ను మా బెడ్‌రూమ్‌కి తీసుకెళ్ళింది ...దీర్ఘవ్యాధితో తీసుకుంటున్న రోగిలా మంచానికి అంటుకుపోయింది....ఏడుస్తోంది..... నా మనస్సుఆగలేదు....ఏడుస్తూ మంచంపై కూర్చొబడ్డాను...."ఏమిటి ?.... ఏమయ్యింది?....డాక్టరుకు చూపించారా? ఏమన్నాడు?.... "కంగారుగా ఏవేవో ప్రశ్నలు వేసాను. అలాంటి బాధను నేను ఎప్పుడూ అనుభవించలేదు.

పరిస్థితులను . అర్థంచేసుకున్న మా అల్లుడు, నా ఆఫీసురూమునుండి కొన్ని కాగితాలు తీసుకొచ్చి "యీ గొడవ కంతకూ యివేకారణం అంకుల్" అంటూ ఆ కాగితాలు నాచేతికిచ్చాడు. వాటిని చూడగానే నాకు అర్థం అయ్యింది. ఆ కాగితాలు చూచి, అంతాచదివి... నేను నోటితో చెప్పలేక, అలా రాసిపెట్టి దేశాంతరంవెళ్ళానని ఊహించి, యింత రాద్ధాంతం చేసింది. నేను పనుల వత్తిడిలో, ఎక్కడున్నానో తెలియపర్చక పోవటంవల్లా.... వాళ్ళు... వాతావరణంవల్ల.....తెలుసుకోలేక పోవటంవల్లనూ... నేను అందరినీ వదిలి వెళ్ళిపోయాననుకున్నారు.

నాకు నవ్వొచ్చింది. ఫక్కున నవ్వాను. "ఒక కథను మా కంపెనీ సోవనీరుకు రాయమని అందరూ బలవంత పెట్టారు....ఏమి రాయాలో తెలియక ఒక నాడు ఏదో రాసాను. ఆ తరువాత పనుల వత్తిడిలో ఆ విషయమే మర్చిపోయాను....వాళ్ళు నన్ను మళ్ళీ అడగలేదు. అయినా ఎవరైనా కావాలని, ఎంతో ముచ్చటగా మక్కువగా పెంచుకున్న నందనవనాన్ని... తన చేతులతోనే నాశనం చేసుకుంటాడా చెప్పండి....'' అన్నప్పుడు అందరి హృదయాలూ తేలికపడ్డాయి.

మా అమ్మాయి నన్ను కావిలేసుకుని "నాన్నా....వచ్చావా!...." అన్నప్పటి దృశ్యం గుర్తుకు వచ్చినప్పుడల్లా నాకళ్ళు చెమ్మగిలతాయి మరి. ★